

ప్రీతి ఘటనపై ఆగని ఆందోళనలు

సీనియర్ విద్యార్థి వేధింపులు భరించలేక మెడికల్ విద్యార్థి ప్రీతి ఆత్మహత్యాయత్నం ఘటనపై ఆందోళనలు ఆగడం లేదు.

- 8లో▸



పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలి

పిల్లలను చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని అర్జున అవార్డు గ్రహీత, డబుల్ ఒలింపియన్ జేజే శోభ తల్లిదండ్రులకు సూచించారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం

39.7⁰ /15.0⁰

వాతావరణం

జిల్లాలో వాతావరణం రోజంతా ఎండ తీవ్రతతో ఉక్కపోతగా ఉంటుంది. మధ్యాహ్నం ఇంటినుంచి బయటకెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలి. రాత్రి కాస్త చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కేంద్ర వైద్య బృందాల పర్యటన



మరిపెడ రూరల్: మండలంలోని మూలమర్రితండా, వాల్యతండా, సోమ్లతండా గ్రామ పంచాయతీల్లో కేంద్రం నుంచి వచ్చిన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ (ఐసీఎంఆర్), నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) వైద్య బృందాలు శనివారం పర్యటించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లోని హెల్త్ క్యాంపులు నిర్వహించి కిడ్నీ సంబంధిత, పోషకాహారం లోపం వ్యాధులతో బాధపడుతున్న వారి వద్ద నుంచి రక్తనమూనాలను సేకరించారు. రిపోర్టులను కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తామని ప్రాజెక్ట్ అసిస్టెంట్ డాక్టర్ ప్రీతి తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఇన్వెస్టిగేటర్ డాక్టర్ జె.శ్రీనివాస్, హుస్సేన్, ప్రాజెక్ట్ టెక్నీషియన్ శ్రావణి, ప్రోవిడర్స్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అభినందన సభ



నెహ్రూసెంటర్: మహబూబాబాద్ డిపో పరిధిలో జనవరి నెలలో ప్రతిభ కనబర్చిన ఉత్తమ ఉద్యోగుల అభినందన సభ శనివారం డిపో ఆవరణలో నిర్వహించారు. ఈసందర్భంగా వరంగల్ రీజనల్ మేనేజర్ జె.శ్రీలత, డిప్యూటీ రీజనల్ మేనేజర్ బి.కృపాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిలుగా పాల్గొని ఉత్తమ ఉద్యోగులను అభినందించి క్యాష్ అవార్డులను అందజేశారు. ఉత్తమ డ్రైవర్లు ఆర్‌బీ.సింగ్, ఎం.సారయ్య, ఉత్తమ కండక్టర్లుగా ఎం.మధుకర్, ఏఏ.కుమార్, ఏఆర్.అల్వార్, ఎన్.వీరన్న, పీఏ.కుమార్, వి.శ్రీనివాస్, ఎండీ.ఆర్ పాషా, ఈకే స్వామి, సీహెచ్.వెంకటేశ్వర్లను సన్మానించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ విజయ్, పర్సనల్ ఆఫీసర్ శ్రీహరి, ఎస్టీఓ అజీముద్దీన్, పాల్గొన్నారు.

శిల్ప కళా సంపద వెరీవెల్



ఖిలా వరంగల్: కాకతీయుల నిర్మాణ శైలి, శిల్ప కళా సంపద వెరీ బ్యూటీఫుల్ అని బెల్జియం దేశస్తులు కొనియాడారు. శనివారం బెల్జియం దేశానికి చెందిన 35మంది పర్యాటకులు కోటను సందర్శించారు. మధ్యకోట ప్రాంగణంలోని శిల్పాలను తిలకించారు. కెమెరాలలో శిల్పాల అందాలను బంధించారు. కాకతీయుల విశిష్టత, కట్టడాల గురించి పర్యాటక శాఖ ప్రమోషన్ అధికారి సూర్యకిరణ్ వివరించారు. వారి వెంట కేంద్ర పురావస్తుశాఖ కోర్డినేటర్ శ్రీకాంత్, టీఎస్‌టీడీసీ కోఆర్డినేటర్ గట్టికొప్పుల అజయ్, సిబ్బంది ఉన్నారు.

'రామప్ప' అద్భుతం

వెంకటాపురం(ఎం): రామప్ప దేవాలయ నిర్మాణం అద్భుతంగా ఉందని బెల్జియం, అమెరికాకు చెందిన పలువురు కొనియాడారు. మండల పరిధిలోని చారిత్రాత్మక రామప్ప దేవాలయాన్ని శనివారం బెల్జియం దేశస్తులు సందర్శించారు. వారు రామలింగేశ్వర స్వామిని దర్శించుకోగా పూజారులు వారికి తీర్థప్రసాదాలు అందించి, ఆశీర్వచనం చేశారు. అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ కుసుమ సూర్యకిరణ్, గైడ్ విజయ్‌కుమార్‌లు ఆలయ విశిష్టత గురించి విదేశీయులకు వివరించారు.

సంస్థ అభివృద్ధికి పాటుపడాలి

హన్మకొండ: సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకుని సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు సూచించారు. హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో మూడు రోజుల పాటు ఉద్యోగులకు ఏఎంఐ సిస్టం డిజైన్, ప్రోగ్రాం మేనేజ్‌మెంట్‌పై జరిగిన శిక్షణ శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని శిక్షణ పొందిన ఉద్యోగులకు సర్టిఫికెట్లు అందించారు. అనంతరం గోపాల్‌రావు మాట్లాడుతూ కొత్త పుంతలు తొక్కుతున్న సాంకేతిక రంగాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. ఉద్యోగులు నిబద్ధతో పని చేయాలన్నారు. ఆర్థికంగా, వాణిజ్య, సాంకేతిక, ఆపరేషన్స్ పరంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉద్యోగులు మెళకువలు నేర్చుకోవాలన్నారు. డైరెక్టర్లు వెంకటేశ్వర్‌రావు, గణపతి, మోహన్ రెడ్డి, తిరుపతిరెడ్డి, ప్రభాకర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిశీలిస్తాం.. పరిష్కరిస్తాం

- కుక్కల బెడదను అరికడతాం
- కోతులపై ప్రభుత్వ ఆదేశాలతో చర్యలు
- పారిశుద్ధ్యం, భగీరథ సమస్యలు లేకుండా చూస్తాం
- మానుకోట మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి
- 'సాక్షి' ఫోన్ ఇన్‌కు విశేష స్పందన





మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీ పరిధిలో కుక్కలు, కోతులు, పందుల సమస్య తీవ్రంగా ఉండగా కుక్కల సంఖ్య తగ్గించేందుకు ఏబీసీ సెంటర్ (ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్)ద్వారా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయిస్తున్నామని, పందుల బెడదను అరికట్టేందుకు పెంపకందారులకు నోటీస్‌లు ఇస్తూ చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి అన్నారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలో కుక్కలు, కోతుల బెడద, తాగు నీరు, పారిశుద్ధ్యం, వీధిలైట్లు, తదితర సమస్యలపై సాక్షి ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణితో ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహించగా. విశేష స్పందన వచ్చింది. ఈ కార్యక్రమాన్ని ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు కేటాయించగా ప్రజలు 10 గంటలోపు నుంచే కాల్స్ చేయడం ప్రారంభించారు. అందుకుతగ్గట్టుగా కమిషనర్ కూడా స్పందించి, కాల్స్ స్వీకరించి, మాట్లాడారు. రెండు ఫోన్ నంబర్ల ద్వారా సుమారు వంద కాల్స్ స్వీకరించగా. సమయం దాటిన తర్వాత పలువురు ఫోన్ చేసి గడువులో చాలా సార్లు ఫోన్‌చేసినా బీజీగా వచ్చిందని మాట్లాడలేక పోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

బారత రమేష్, 36వార్డు: ఇటీవల మా అమ్మను కోతి కరువగా. కూతురును కుక్క కరిచిందని కృష్ణ కాలనీలో వాటిని అరికట్టాలి.

కమిషనర్ ప్రసన్నరాణి: కుక్కలకు చెక్ పెట్టేందుకు ఏబీసీ సెంటర్ ఏర్పాటు చేశామని, ఆంటి రేబీస్ వ్యాక్సిన్ కూడా ఇస్తున్నామన్నారు. ఆపరేషన్‌చేసిన కుక్కల మెడకు బెల్ట్ పెట్టడంతో పాటు దాని చెవిని కొంత భాగం కత్తిరిస్తున్నట్లు చెప్పారు. కోతుల సమస్యల విషయంలో ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే తగు చర్యలు తీసుకుంటామన్నారు.

షేక్‌ఖాదర్‌బాబా, బేతోలు: కోతులు, కుక్కల బెడత తీవ్రంగా ఉంది. సమస్య పరిష్కరించాలి. విలీన గ్రామాలకు ఎక్కువ నిధులు కేటాయించాలి.

కమిషనర్: కుక్కల సంఖ్య తగ్గించేందుకు చర్యలు చేపట్టాం. సీఎం కేటాయించిన నిధులు ఉన్నాయని ఎమ్మెల్యే, కలెక్టర్, చైర్మన్ దృష్టి తీసుకెళ్తాను. నిధుల కేటాయింపునకు కృషి చేస్తాం.

బొద్దుపల్లి ఉపేందర్: ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ స్టేడియం, జూనియర్ కాలేజీ వంటి ప్రదేశాల్లో వాకర్స్ కోసం తాగు నీటి సౌకర్యం కల్పించాలి.

కమిషనర్: ఆప్రాంతాల్లో తాగు నీటి సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తాం.

వీరు నాయక్, భరత్, అనంతారం: కోతుల కుక్కల సమస్యల పరిష్కారంతో పాటు సీసీ రోడ్లు, డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలి.

కమిషనర్: ఎమ్మెల్యే, కలెక్టర్, చైర్మన్ దృష్టికి ఈసమస్యలను తీసుకెళ్లి నిధుల కేటాయింపునక కృషి చేస్తాం.

శివకుమార్, జమాండ్లపల్లి: మిషన్‌భగీరథ నీటి సరఫరా సక్రమంగా లేదు. కోతుల కుక్కల సమస్య ఉంది.

కమిషనర్: మిషన్ భగీరథ పైప్‌లైన్ లింకేజీలను చెక్ చేయమని సిబ్బందిని ఆదేశిస్తాం. కుక్కల సమస్య పరిష్కరిస్తాం.

రామకృష్ణ, సయ్యద్ నిజాం, గాంధీపురం: కోతులు, కుక్కల సమస్యతోపాటు, గ్రామంలో పాత జీపీ భవనం దగ్గరలోని బొర్రాయి నుంచి పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉంది.

కమిషనర్: పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరిస్తాం. కాల్వ నిర్మాణాలపై వార్డు కౌన్సిలర్, ఎమ్మెల్యే, కలెక్టర్, చైర్మన్ కు సమస్య వివరిస్తాం.

చలమల నారాయణ, మాజీ వార్డు కౌన్సిలర్: కోతుల కుక్కల సమస్యను పరిష్కరించాలి. జీవ వైవిధ్య కమిటీలు, కోతుల కోసం పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

కమిషనర్: కుక్కలను అరికట్టేందుకు ఏబీసీ సెంటర్, పందుల నివారణకు నోటీస్‌లు ఇచ్చాం. కోతుల విషయంలో అటవీ శాఖ సంబంధిత అధికారులతో మాట్లాడుతాం. జీవ వైవిధ్య కమిటీల విషయంలో కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతాను.

వీరు నాయక్, జూనియర్ ఆడిటర్: యశోద గార్డెన్ వెనుక డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉంది. పలు మార్లు వినతులు ఇచ్చినా పట్టించుకోవడం లేదు.

కమిషనర్: సమస్య మా దృష్టిలో ఉంది. అక్కడ డ్రెయినేజీ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కౌన్సిల్‌లో మాట్లాడుతాను. అంతవరకు ఆప్రాంతాన్ని శుభ్రం చేయిస్తాం.

మాలె హేమచందర్, 32 వార్డు: కాల్వలు శుభ్రం చేయడం లేదు. దుర్గంధం వెదజల్లుతుంది.

కమిషనర్: కాల్వలను శుభ్రం చేయించడంతో పాటు వీధిలైట్ల ఇతరత్రా అన్ని సమస్యలు పరిష్కరిస్తాం.

కాటా శ్రీను, శ్రీరంగం శోభన్ బాబు, 14 వార్డు: మిషన్ భగీరథ నీటి సమస్య పరిష్కరించి, వీధిదీపాలు ఏర్పాటు చేయాలి.

కమిషనర్: పనులు త్వరగా పూర్తి చేయించి తాగు నీటి సమస్య పరిష్కరిస్తాం. వీధిదీపాలు ఏర్పాటు చేస్తాం.

సింగంశెట్టి బాబు, జమాండ్లపల్లి: కోతులు, కుక్కల దాడిలో చాలా మంది గాయపడ్డారు. ఒకరు మృతి చెందారు.

కమిషనర్: కుక్కల కోసం ఏబీసీ సెంటర్ ఏర్పాటు చేశాం. కోతులను అరికట్టేందుకు ప్రభుత్వ ఆదేశాలు రాగానే చర్యలు తీసుకుంటాం. ఇతరత్రా సమస్యలు పరిష్కరిస్తాం.

ఉమాశర్, 36 వార్డు: ఎస్వీ కాలేజీ ఎదుట రోడ్డు, డ్రెయినేజీ సౌకర్యం లేదు.

కమిషనర్: ఆ సమస్యను ఎమ్మెల్యే, కలెక్టర్, చైర్మన్ దృష్టికి తీసుకెళ్తా. ఆప్రాంతం శుభ్రం చేయించి తాత్కాలికంగా సమస్య పరిష్కరిస్తాం.

కమటం రమేష్, హౌజింగ్‌బోర్డు: పందులు, కోతులు, కుక్కల సమస్యతో పాటు డ్రెయినేజీ సమస్య ఉంది.

కమిషనర్: పందులను జనావాసాల నుంచి బయటికి తరలిస్తున్నాం. పట్టణంలోకి రాకుండా చర్యలు చేపట్టాం.

విజయ, ఆరో వార్డు: రోడ్ల డ్రెయినేజీ సమస్యతో పాటు కుక్కల బెడదను అరికట్టాలి.

కమిషనర్: నిర్మాణాల విషయంలో కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాను. కుక్కల సమస్య పరిష్కరిస్తాం.

భాగ్యమ్మ, 19 వార్డు: రోడ్డు సమస్య పరిష్కరించాలి.

కమిషనర్: ఆరోడ్డును సందర్శించి తర్వాత చర్యలు తీసుకుంటాం.

సీపీఐ నాయకులు పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న: పలు వార్డుల్లో మిషన్ భగీరథ, రోడ్లు డ్రెయినేజీలు, ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు ఇతరత్రా సమస్యలు ఉన్నాయి.

కమిషనర్: భగీరథ సమస్య త్వరలోనే పరిష్కారిస్తాం. మిగిలిన సమస్యలను పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

సుధా, మార్వాడి బజార్: తడి చెత్త ఒక రోజు పొడి చెత్త ఒక రోజు తీసుకెళ్లాలి.

కమిషనర్: సిబ్బందితో మాట్లాడి ప్రణాళికతో పారిశుద్ధ్య పనులు జరిగేలా చూస్తాం.

గౌసోద్దీన్, 22 వార్డు: శ్రావణి బార్ వెనుక నుంచి గల్లీ అంతా అపరిశుభ్రంగా ఉండి పందులు పెరిగాయి.

కమిషనర్: ఆప్రాంతం శుభ్రం చేయించి పందులు లేకుండా చేస్తాం.

సతీష్‌రెడ్డి, ఒకటో వార్డు: కోతులు ఇంటిపై కప్పు పెంకులు తీస్తున్నాయి. ఇంట్లో వచ్చి ఆగమాగం చేస్తున్నాయి.

కమిషనర్: కోతుల సమస్య విషయంలో సంబంధిత అధికారులతో మాట్లాడుతాం. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చేస్తాం.

చుక్కల నరేష్‌తోపాటు పలువురు పలు ప్రాంతాల పేర్లు మార్చి బోర్డులు ఏర్పాటు చేశారని వాటిని పాత పేర్లు పెట్టాలని కోరారు.

కమిషనర్: ఆ ప్రాంతవాసులతో మాట్లాడి కౌన్సిలర్లతో చర్చించి తదుపరి నిర్ణయం తీసుకుంటాం.

శ్రీనివాస్‌రెడ్డి, 30 వార్డు: నందినగర్‌లో పందుల సమస్య తీవ్రంగా ఉంది.

కమిషనర్: పెంపకందారులకు నోటీస్‌లు ఇచ్చాం. జనావాసాల మధ్య లేకుండా చేస్తాం. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి.

శ్రీపాల్: మన్‌మోహన్‌రెడ్డి కాంప్లెక్స్ వెనుక కిరాణం వర్తక సంఘం భవనం ప్రాంతంలో మిషన్ భగీరథ పైప్‌లైన్లు వేయాలి, పందుల సమస్య పరిష్కరించాలి.

కమిషనర్: భగీరథ పైప్‌లైన్లు అన్ని ప్రాంతాల్లో వేస్తారు. పందుల సమస్య కూడా తీరుతుంది.

ఖాజా, ఫిరోజ్, ఇమ్రాన్, బబ్బులు, సత్యనారాయణ, పోలేపాక వెంకన్న, పద్మ, అనురాధ, కవిత, ఉపేందర్, కరుణాకర్, సంతోష్, రామారావు, మహేష్, శ్రీను, నరేందర్, ఉప్పలయ్యతో పాటు పలువురు కోతులు, కుక్కలు, పందుల సమస్యలతో పాటు రోడ్లు, డ్రెయినేజీ సమస్యలపై కమిషనర్‌తో మాట్లాడారు. అందుకు కమిషనర్ సమాధానం ఇచ్చారు.

అనంతరం కమిషనర్ మాట్లాడుతూ వచ్చి జనాలు తెలియజేసిన సమస్యల్లో తమ పరిధిలోని వాటని త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు. పారిశుద్ధ్య పనులను రెండు రోజుల్లో పూర్తి చేయాలని సానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీహరిని ఆదేశించారు. ఏబీసీ సెంటర్‌తో 3,000 కుక్కలకు ఆపరేషన్ చేయడంతోపాటు యాంటి రేబీస్ వ్యాక్సిన్ వేయించడం జరుగుతుందన్నారు. కోతుల విషయంలో అటవీ శాఖ అధికారులతో పాటు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్‌తోపాటు మేనేజర్ శ్రీధర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి, సిబ్బంది రాజేష్ పాల్గొన్నారు. వచ్చింది. ఫోన్‌ఇన్ ద్వారా సమస్యలు చెప్పుకోవడానికి అవకాశం ఇచ్చిన 'సాక్షి'కి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి

- కలెక్టర్ శశాంక



మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

మహబూబాబాద్: హరితహారం లక్ష్యాలను సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో 9వ విడత హరితహారం లక్ష్యాల సాధింపుపై శనివారం సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 461జీపీల్లోని నర్సరీల్లో మొక్కల పెంపకం జరగాలన్నారు. ఇళ్లలో పంపిణీ చేసే పండ్ల మొక్కలు, వాటి రకాలు, అవెన్యూ ప్లాంటేషన్‌లో ఎత్తుగా పెరిగే మొక్కలు నాటాలని చెప్పారు. ప్రభుత్వ భవనాల ఆవరణలో నీడనిచ్చే అందమైన పూల మొక్కలు, నీటి వసతి లేని ప్రాంతాల్లో ఎదిగే రావి, మర్రి, చింత వేప, వంటి మొక్కల రకాలు పెంచేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. నాటిన ప్రతి మొక్కకు ట్యాంకర్లతో నీరుపట్టాలని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు హరితహారం లక్ష్యాలను సాధించేందుకు సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. డీఎఫ్ఓ రవికిరణ్ మాట్లాడుతూ.. అటవీ శాఖ ద్వారా 10 నుంచి 11 లక్షల వరకు మొక్కల పెంపకం చేపడుతున్నామని తెలిపారు. సబాబుల్, యూకలిప్టస్ మొక్కలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ పింకేష్‌కుమార్, జెడ్పీ సీఈఓ రమాదేవి, డీఆర్‌డీఏ సన్యాసయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇనుగుర్తిని అభివృద్ధి చేస్తాం



రవిచంద్రకు పూలమొక్క అందజేస్తున్న కలెక్టర్

మహబూబాబాద్: జిల్లాలోని కేసముద్రం మండలం నుంచి ప్రత్యేక మండలంగా ఏర్పడిన ఇనుగుర్తి మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని కలెక్టర్ శశాంక అన్నారు. కలెక్టర్ తన చాంబర్‌లో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవి చంద్రతో శనివారం సమావేశమయ్యారు. రవిచంద్రకు కలెక్టర్ పూలమొక్క ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఇనుగుర్తి అభివృద్ధిపై కలెక్టర్‌తోపాటు జిల్లా అధికారులతో సమీక్షించారు. రవిచంద్ర మాట్లాడుతూ.. ఇనుగుర్తి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అభివృద్ధి చేయాలని కోరారు. మండల అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలకు స్థలం కేటాయించాలన్నారు. ఇనుగుర్తి పాఠశాల అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలని, గ్రామంలో పురాతన శివాలయాన్ని సొంత నిధులతో పునర్నిర్మిస్తామన్నారు. కలెక్టర్ శశాంక మాట్లాడుతూ.. ఇనుగుర్తి పాఠశాలలో 8, 9 తరగతులు చదివే విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తే సకాలంలో పాఠశాలకు చేరుకునే అవకాశం ఉందన్నారు. పదో తరగతి విద్యార్థులకు అల్పాహారానికి సహకారం అందచేయాలని కోరారు. 108 వాహనం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి చర్యలతోపాటు రహదారులు, డ్రెయినేజీల నిర్మాణాలు త్వరలో చేపడుతామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డేవిడ్, అధికారులు ఉన్నారు.

సమన్వయ లోపం.. అభివృద్ధికి శాపం

- ధర్మకర్తలు, అధికారుల మధ్య పోరు
- ఈఓపై నాయకుల రుసరుసలు
- నేటితో ముగియనున్న కురవి దేవస్థానం పాలక మండలి పదవీ కాలం



కురవి వీరభద్ర స్వామి దేవాలయం

సాక్షి, మహబూబాబాద్: కోరిన వారికి కొంగు బంగారం.. కోర మీసం పెడితో విజయం తథ్యం.. ఇంతటి మహిమగల కురవి వీరభద్రుని సన్నిధిలో మాత్రం అధికారులు, నాయకులు, పాలక మండలి, చైర్మన్ మధ్య చిచ్చు. పదవీ భద్యతలు చేపట్టిన నాటి నుంచి విరమణ వరకు కూడా పొసగని పొత్తులు.. కుదరని సమన్వయం.. దీంతో దేవాలయంలో నిధులు ఉన్నా.. భక్తులకు వసతులు కల్పించడంలో నీరసం.. వీరి సమన్వయం లోపం.. అభివృద్ధికి శాపంగా మారిందనడంలో అతిశయోక్తి లేదు. ఇటువంటి పరిస్థితిలో దేవాలయం పాలక మండలి పదవీకాలం నేటి(ఆదివారం)తో ముగుస్తుంది.

ఎవరిదారి వారిదే..!

దైవ కార్యం అంటే.. అంకిత భావం. ఆధ్యాత్మికతతోపాటు, సహనం, సమయస్ఫూర్తి కావాలి. అటువంటి వారినే చూసి దేవాలయాలకు ధర్మకర్తలుగా నియమిస్తారు. అయితే కురవి దేవాలయంలో నియమించిన చైర్మన్, ధర్మకర్తలు అందరూ వ్యక్తిగతంగా మంచివారే అయినప్పటికీ.. సమన్వయ లోపంతోనే పదవీ కాలం ముగిసే వరకు కొనసాగడం గమనార్హం. గత రెండు సంవత్సరాల క్రితం సోమిశెట్టి శ్రీనివాస్ పదవీ కాలం ముగియడంతో అనూహ్య పరిణామాల నేపథ్యంలో బాదావత్ రామునాయక్‌కు చైర్మన్ పదవి దక్కింది. అయితే ఆయనతోపాటు నియమితులైన పాలక మండలి సభ్యులు మొదటి నుంచి ఎడ మొఖం పెడమొఖంగా ఉంటూ వచ్చారు. ఈ పరిస్థితే చివరి వరకు కొనసాగింది. ఈ విషయంపై పాలక మండలి నాయకులు సహకరించడం లేదని రామునాయక్ పలుమార్లు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే చైర్మన్ కమిటీని కలుపుకొని పోవడంలేదని ధర్మకర్తలు తమ అనుచరులతో చెప్పిన సందర్భాలు ఉన్నాయి.

కుంటుపడిన అభివృద్ధి

పాలక మండలి సమన్వయ లోపం దేవాలయ అభివృద్ధికి శాపంగా మారింది. తెలంగాణ ఉద్యమ సమయంలో సీఎం కేసీఆర్ వీరభద్రుడికి కోర మీసం పెడతానని మొక్కుకున్నారు. అన్న మాట ప్రకారం కురవి వచ్చి మొక్కులు చెల్లించుకున్న సీఎం దేవాలయ అభివృద్ధికి రూ.5కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో మహాప్రాకార మండపం, మూడు రాజగోపురాలు, కాలక్షేప మండం పనులు పూర్తి చేయగా.. నిర్మించిన సత్రాల్లో ఇంక పని మిగిలి ఉంది. అదేవిధంగా రథశాల, గెస్ట్‌హౌజ్ నిర్మాణాలు ముందుకు సాగలేదు. దీంతో పెరిగిన రేట్ల ప్రకారం ఈ పనులు పూర్తి చేయడం కాంట్రాక్టర్‌కు ఇబ్బందిగా మారింది. అయితే ఒక వైపు ఈఓ, మరోవైపు చైర్మన్, ఇంకో వైపు ధర్మకర్తల మధ్య సమన్వయం లేకపోవడంతోనే కాంట్రాక్టర్‌తో పనులు చేయించుకోలేకపోయారనే ఆరోపణలు ఉన్నాయి. పనులు చేయని కాంట్రాక్టర్‌పై ఈఓ సత్యనారాయణ ఎండోమెంట్ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినట్లు సమాచారం.

పైసల కొట్లాటేనా..?

కురవి దేవాలయంలో ఒకరంటే మరొకరికి గిట్టని పరిస్థితికి అసలు కారణం పైసల కొట్లాటే అనే ప్రచారం ఉంది. గతంలో పనిచేసిన కమిటీలు దేవాలయ నిధులతో పనులు చేయించేవారు. కానీ ఇప్పుడు ఉన్న ఈఓ ప్రతీ రూపాయిని దేవస్థానం అకౌంట్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా చేస్తున్నారని ప్రచారం. దీంతో డబ్బులు ఖర్చు పెట్టాలంటే ముందుగా కమిటీ తీర్మానం. తర్వాత ఈఓ ద్వారా దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులకు ప్రతిపాదనలు పంపాలి. అక్కడి నుంచి గ్రీన్ సిగ్నల్ వస్తేనే డబ్బులు ఖర్చు పెట్టే అవకాశం లేదు. ఇంత ప్రాసెస్ చేయడం, అందులోనూ సమన్వయం లేని కమిటీతో కుదరడం లేదు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే రెడ్యానాయక్ ధర్మకర్త మండలి, చైర్మన్‌లపై ఇటీవల జరిగిన సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయంలో జరుగుతున్న పనులేంటి.. నిధులు ఎన్ని వస్తున్నాయి? లెక్కలు ఏంటి? ఎంత ఖర్చు చేస్తున్నారు? అన్ని లెక్కలు చెప్పాలి అంటూ ఎమ్మెల్యే మండి పడటం చర్చగా మారింది. అయితే ఈ తంతు చూసిన ఈఓ ఇక్కడి నుంచి బదిలీ చేయాలని ఉన్నతాధికారులకు అర్జీ పెట్టుకున్నట్లు సమాచారం. అదేవిధంగా ధర్మకర్తలతో సమన్వయంగా పనిచేయని ఈఓను బదిలీ చేయించేందుకు కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిసింది.

పాలకవర్గం పదవీకాలం నేటితో పూర్తి

కురవి వీరభద్రస్వామి దేవాలయం ధర్మకర్త మండలి పాలక వర్గం పదవీకాలం ఆదివారంతో ముగియనుంది. కొత్త కమిటీ చైర్మన్, ధర్మకర్తల కోసం ఇప్పటి నుంచి సాగుతున్నాయి. గత అనుభవాలను పరిగణలోకి తీసుకొని సమన్వయం, పరస్పర సహకారం ఆధ్యాత్మికతో పనిచేసే కమిటీ ఎంపిక చేసుకునే భారం ఆ వీర భద్ర స్వామిదే అంటున్నారు భక్తులు.!

నిందితులను కఠినంగా శిక్షించాలి



పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న తల్లిదండ్రులు

మరిపెడ: విద్యార్థులపై అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయులు, వాచ్‌మెన్, బస్సు డ్రైవర్‌లను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేస్తూ స్థానిక సెయింట్ అగస్టీయన్ పాఠశాల ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం ధర్నా నిర్వహించారు. పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ఖదీర్, రాంబాబు, రవి, వాచ్ మెన్ చిచ్చు, స్కూల్ బస్సు డ్రైవర్ శ్రీనులు విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తించిన ఘటన విధితమే. ఈ నేపథ్యంలో పాఠశాల యాజమాన్యం ఉదాసీనత చూపిస్తుందని ఆరోపిస్తూ విద్యార్థినుల తల్లిదండ్రులు ధర్నాకు దిగారు. నిందితులను పాఠశాల నుంచి తొలగించాలని ఇలాంటి ఘటనలు గతంలో జరిగినా యాజమాన్యం ఏమాత్రం శ్రద్ధ చూపకపోవడం విచారకరమని ఆరోపించారు. విద్యార్థినులు కొంత కాలంగా ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసినా స్పందించలేదని ప్రిన్సిపాల్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇంత జరుగుతున్న కనీసం ప్రిన్సిపాల్ విద్యార్థుల తల్లిదండ్రులకు సమాధానం చెప్పకపోవడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతవరణం నెలకొన్నది. సంఘటనా స్థలానికి ఎస్సై పవన్‌కుమార్ చేరుకొని ఆందోళన చేస్తున్నవారికి సర్దిచెప్పే ప్రయత్నం చేసినా ప్రిన్సిపాల్ వచ్చి సమాధానం చెప్పే వరకు విరమించేదిలేదని భీష్మించుకుని కూర్చున్నారు. చివరకు నిందితులకు శిక్ష పడేలా చూస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం పిన్సిపాల్ రూసిని మాట్లాడుతూ.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పదిహేను రోజుల్లో పేరెంట్స్ సమావేశం ఏర్పాటు చేస్తానమి చెప్పారు. తాను పాఠశాలలో లేనప్పుడు ఈ ఘటన జరిగిందని అందుకు చింతిస్తున్నట్లు ప్రకటించారు. ఇదిలా ఉండగా.. లైంగిక వేధింపులకు పాల్పడిన ముగ్గురు ఉపాధ్యాయులు, పాఠశాల వాచ్‌మెన్, బస్సు డ్రైవర్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ సాగర్ తెలిపారు.

చర్యలు తీసుకుంటాం

మహబూబాబాద్ అర్బన్: మరిపెడ మండలంలోని సెయింట్ అగస్టిన్ పాఠశాలలో బాలికలను వేధింపులకు గురిచేసిన విషయంపై డీఈఓ రామారావు, ఐసీడీఎస్ సిబ్బంది, మహిళ ఉపాధ్యాయులు, చైల్డ్ లైన్ అధికారులతో కలిసి పాఠశాలను శనివారం సందర్శించారు. విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని, ఉద్యోగం నుంచి తొలగించాలని పాఠశాల యాజమాన్యనికి ఆదేశించినట్లు డీఈఓ తెలిపారు. యాజమాన్యంపై చర్యలకు తీసుకుంటామన్నారు.

వైభవంగా వసంతోత్సవం

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం తెల్లవారుజామున శివాలయం వద్ద దీపోత్సవం నిర్వహించిన అనంతరం శ్రీ వీరభద్రస్వామికి వసంతోత్సవం, పెద్ద చెరువులో త్రిశూలస్నాన కార్యక్రమాలను వైభవంగా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితుల వేద మంత్రోచ్చరణల నడుమ వీరభద్రస్వామికి స్థాపిత కలశాలతో పూర్ణాభిషేకం చేశారు. స్వామివారికి కల్యాణం తర్వాత తొమ్మిదిరోజులపాటు అభిషేకాలు నిర్వహించకుండా ఉంటారు. తొమ్మిదోరోజైన వసంతోత్సవం సందర్భంగా స్వామివారికి పూర్ణాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారు ప్రత్యేక శావలో గ్రామసేవ, స్వామివారి చందనాభిషేకం నీటితో వసంతోత్సవం నిర్వహిస్తారు. స్వామివారికి సుగంధ ద్రవ్యాలు, చందనం, పసుపుతో కలిపిన అభిషేకం నిర్వహించారు. చండీశ్వరుని ఆయుధమైన త్రిశూలంతో ప్రత్యేక శావలో కురవి పెద్ద చెరువు వద్దకు తీసుకొచ్చి, త్రిశూలస్నానం చేయించారు. కార్యక్రమంలో రవి, సమ్మయ్య, అర్చకులు, వేదపండితులు తేజ, శ్రీకర్, షన్ముఖశర్మ, వీరభద్ర స్వామిమాల వేసిన భక్తులు పాల్గొన్నారు.



వీరభద్రస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు

జీడబ్ల్యూఎంసీ కొత్త పరిపాలన భవనం



ప్రారంభమైన నూతన పరిపాలన భవన నిర్మాణ పనులు

వరంగల్‌ అర్బన్‌ : వరంగల్‌ మహా నగర పాలక సంస్థ(జీడబ్ల్యూఎంసీ) నూతన పరిపాలన భవన నిర్మాణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. అధునాతన ప్రమాణాలతో బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలోని మెప్మా కార్యాలయానికి పక్కన ఈ భవనం నిర్మాణం కానుంది. ఆరు నెలల కిందట రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌ చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. జీప్లస్‌5లో భారీ భవనం ప్రణాళికలో తొలుత జీప్లస్‌2 భవనాన్ని నిర్మించనున్నారు. తదుపరి మరో మూడు అంతస్తులు నిర్మించనున్నారు. ఇందుకు రూ.20.50కోట్లను వ్యయం చేస్తున్నారు. భవనాన్ని రాష్ట్ర టౌన్‌అండ్‌కంట్రీ ప్లానింగ్‌ విభాగం నిపుణుల సూచనలు, అనుమతి తీసుకొని నిర్మాణం చేస్తున్నట్లు బల్దియా ఇంజనీర్లు పేర్కొన్నారు.

మోసానికి పాల్పడిన ముగ్గురిపై కేసు

కాజీపేట: దాదాపు రెండు దశాబ్దాల కింద అమ్మిన ప్లాటును మరొకరికి విక్రయించి మోసానికి పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు కాజీపేట ఇన్‌స్పెక్టర్‌ గట్ల మహేందర్‌ రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం 61వ డివిజన్‌ ప్రశాంత్‌ నగర్‌ కాలనీలో ఓ ప్లాట్‌ను అందె యాదయ్య అనే వ్యక్తి 2003లో కొనుగోలు చేశాడు. అదే ప్లాట్‌ను భూక్యా యమున అనే మహిళ ఇటీవల విక్రయించి డబ్బులు వసూలు చేసింది. మొదట కొనుగోలు చేసిన యాదయ్య ఫిర్యాదు మేరకు యమునతోపాటు కుమారులు అనిల్‌కుమార్‌, సంపత్‌ కుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలి

- అర్జున అవార్డు గ్రహీత జేజే శోభ
- త్వరలో క్రీడా క్యాలెండర్‌
- ప్రభుత్వ చీఫ్‌విప్‌ వినయ్‌భాస్కర్‌



పరుగెత్తుతున్న పురుషులు

వరంగల్‌ స్పోర్ట్స్‌: పిల్లలను చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని అర్జున అవార్డు గ్రహీత, డబుల్‌ ఒలింపియన్‌ జేజే శోభ తల్లిదండ్రులకు సూచించారు. హనుమకొండలోని జవహర్‌లాల్‌ నెహ్రూ స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న 9వ తెలంగాణ యూత్‌ అండ్‌ 400 మెన్‌ (ఆల్‌ ఏజ్‌ గ్రూప్స్‌) అథ్లెటిక్స్‌ చాంపియన్‌షిప్‌ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. హనుమకొండ అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో జరుగనున్న పోటీలకు ముఖ్య అతిథిగా జేజే శోభ హాజరై మాట్లాడారు. గతంలో కంటే క్రీడా వసతులు మెరుగుపడ్డాయని, అయితే వసతుల కల్పనలో మరింత ఆధునీకరణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడాకారులు మొబైల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, కోచ్‌ పర్యవేక్షణలో పట్టుదల, క్రమశిక్షణతో క్రీడల్లో సాధన చేయాలని అన్నారు. మరో అతిథి ప్రభుత్వ చీఫ్‌విప్‌ దాస్యం వినయ్‌భాస్కర్‌ మాట్లాడుతూ తెలంగాణ సీఎం కేసీఆర్‌ ప్రత్యేక క్రీడాపాలసీ అమలుకు ప్రణాళిక సిద్ధం చేశారని అన్నారు. నగరంలో క్రీడాభివృద్ధికి ప్రత్యేక క్రీడా క్యాలెండర్‌ను రూపొందించి అమలు చేయనున్నట్లు తెలిపారు. అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌ జిల్లా కార్యదర్శి కె.సారంగపాణి మాట్లాడుతూ 33 జిల్లాల నుంచి 500 మంది క్రీడాకారులు, 100 వరకు టెక్నికల్‌ అఫిషియల్స్‌, రెఫరీలు హాజరయ్యారని తెలిపారు. 28 ఈవెంట్లలో జరిగే పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు మార్చి 10 నుంచి 12 వరకు కర్ణాటకలోని ఉడిపిలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. బ్యాడ్మింటన్‌ సంఘం జిల్లా కార్యదర్శి పి.రమేష్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్‌ మహ్మద్‌ అజీజ్‌ఖాన్‌, డీవైఎస్‌ఓ గుగులోత్‌ అశోక్‌కుమార్‌, అథ్లెటిక్స్‌ సంఘం బాధ్యులు మూగల కుమార్‌యాదవ్‌, లెక్కల రాజిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ఐలి చంద్రమోహన్‌ గౌడ్‌, అంతర్జాతీయ అథ్లెట్‌ నాగమణి, టెక్నికల్‌ అఫీషియల్స్‌ శ్రీమన్నారాయణ, నాగరాజు, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

మండుటెండలో క్రీడా వేడుకలు

జవహర్‌లాల్‌ నెహ్రూ స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న అథ్లెటిక్స్‌ చాంపియన్‌షిప్‌ ఏర్పాట్లలో నిర్వాహకులు పూర్తిగా విఫలమయ్యారు. రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించే వేదిక వద్ద ప్రాథమిక వైద్యచికిత్స అందించేందుకు అందుబాటులో వైద్య సిబ్బందితో పాటు అంబులెన్స్‌ను సైతం స్టేడియం వద్ద ఉంచాలి. మండుటెండలో క్రీడాకారులు భోజనం చేసేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం 8 గంటలకే అథ్లెటిక్స్‌లో వివిధ ఈవెంట్లలో పోటీలను నిర్వహించిన అసోసియేషన్‌ బాధ్యులు అధికారికంగా ప్రారంభోత్సవ వేడుకలు 10 గంటలకు నిర్ణయించారు. వేడుకలకు అర్జున అవార్డు గ్రహీత, డబుల్‌ ఒలింపియన్‌ జేజే శోభ ముఖ్య అతిథిగా హాజరు కాగా మరో అతిథి ప్రభుత్వ చీఫ్‌విప్‌ దాస్యం వినయ్‌భాస్కర్‌ కోసం సుమారు మూడున్నర గంటల పాటు ఎదురు చూశారు. అప్పటికే అనేక ఈవెంట్లలో పాల్గొన్న క్రీడాకారులు అలసిపోయారు.



మాట్లాడుతున్న చీఫ్‌విప్‌ వినయ్‌భాస్కర్‌



హైజంప్‌ చేస్తున్న యువతి



జేజే శోభను సత్కరిస్తున్న చీఫ్‌విప్‌ వినయ్‌భాస్కర్‌

ప్రీతి ఘటనపై ఆగని ఆందోళనలు



కేఎంసీ గేటు ఎదుట ఆందోళన చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

- కేఎంసీ గేటు ఎదుట గిరిజన సంఘాల ఆందోళన

ఎంజీఎం : సీనియర్‌ విద్యార్థి వేధింపులు భరించలేక మెడికల్‌ విద్యార్థి ప్రీతి ఆత్మహత్యాయత్నం ఘటనపై ఆందోళనలు ఆగడం లేదు. శుక్రవారం పోలీస్‌ కమిషనర్‌ నిందితుడు సైఫ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌ నిమిత్తం ఖమ్మం జైలుకు తరలించినప్పటికీ గిరిజన సంఘాల నాయకులు తమ ఆందోళనలు ఆపడం లేదు. ప్రీతి ఆత్మహత్యాయత్నానికి కారణమైన సైఫ్‌ను వెంటనే ఎన్‌కౌంటర్‌ చేయాలని డిమాండ్‌ చేస్తూ శనివారం కాకతీయ మెడికల్‌ కళాశాల గేటు వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఘటనపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎంజీఎం సూపరింటెండెంట్‌, కేఎంసీ ప్రిన్సిపాల్‌, హెచ్‌ఓడీలను వెంటనే సస్పెండ్‌ చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్‌ చేశారు. గిరిజన సంఘాల నాయకులు ఆందోళనతో పెద్దఎత్తున ట్రాఫిక్‌జామ్‌ కాగా ఇంతేజార్‌గంజ్‌ సీఐ మల్లేశ్‌, మట్టెవాడ ఎస్‌హెచ్‌ఓ శంకర్‌ వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

బైక్‌ అదుపు తప్పి యువకుడి మృతి

వర్ధన్నపేట : మండలంలోని ఇల్లంద శివారులో ద్విచక్ర వాహనం అదుపు తప్పి యువకుడు మృతిచెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై రామారావు కథనం ప్రకారం.. మహబూబాబాద్‌ జిల్లా పెద్దవంగర మండలం గంట్లకుంట గ్రామానికి చెందిన చెరుకు శోభన్‌(20) వరంగల్‌లోని తన స్నేహితుడిని కలిసేందుకు వెళ్తుండగా ఆక్టీవా బైక్‌ వేగంగా వెళ్తూ బ్రేక్‌ వేయడంతో కింద పడి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుని తండ్రి చెరుకు మల్లయ్యకు ముగ్గురు కుమారులు కాగా చిన్న కుమారుడు శోభన్‌. ఇతను హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం సొంత గ్రామంలో ఇంటి వద్ద ఉప్పలమ్మ పండుగకు వచ్చాడు. ఫ్రెండ్‌ను కలిసేందుకు వరంగల్‌ వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో ఇల్లంద గ్రామశివారులోని లక్ష్మిగార్డెన్‌ ఎదుట వరంగల్‌ ఖమ్మం జాతీయ రహదారిపై బైక్‌ అదుపు తప్పి మృతి చెందాడు.

ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

మండలంలోని ఇల్లంద శివారులోని లక్ష్మిగార్డెన్‌ వద్ద శనివారం ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొట్టిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. రాయపర్తి నుంచి తన కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో వరంగల్‌ వెళ్తుండగా, వరంగల్‌ నుంచి తొర్రూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు మరో వాహనాన్ని ఓవర్‌టేక్‌ చేసి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో రోడ్డు ప్రక్కకు వెళ్లి నిలిచిపోయింది. ఆటోలో ఉన్న ముగ్గురు ప్రయాణికులకు గాయాలు కావడంతో స్థానికులు వెంటనే వరంగల్‌ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

జువైనల్‌ హోంకు ఏడుగురు బాలలు

కాజీపేట: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఏడుగురు బాలురపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా జువైనల్‌ మేజిస్ట్రేట్‌ వారిని రెండు రోజుల పాటు అబ్జర్వేషన్‌ కోసం జువైనల్‌ హోంకు పంపించినట్లు కాజీపేట ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ కె.రామకృష్ణ తెలిపారు. కాజీపేటలో వాహనాల తనిఖీలు చేపట్టగా పిల్లలు వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కారు. వారిపై కోర్టులో ఛార్జ్‌షీట్‌ వేయడంతో పాటు పిల్లలకు వాహనాలను ఇచ్చిన యజమానులకు జరిమానాలు విధించినట్లు సీఐ వివరించారు.

ముసలమ్మకుంటలో గల్లంతైన విద్యార్థి మృతి

- శాంతినగర్‌లో విషాదం



అలీం మృతదేహాన్ని తీసుకొస్తున్న పోలీసులు

వరంగల్‌: వరంగల్‌ ఏనుమాముల సమీపంలోని ముసలమ్మకుంటలో చేపలవేట కోసం వెళ్లి గల్లంతైన విద్యార్థి అలీం(15) మృతదేహం శనివారం ఉదయం చెరువులో తేలిందని ఎస్సై పోగుల శ్రీకాంత్‌ తెలిపారు. ఎస్సై శాంతినగర్‌ వాసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని 20వ డివిజన్‌ శాంతినగర్‌కు చెందిన సాజిదా, అఫ్జల్‌లకు ఇద్దరు కుమారులు అలీం, అజీం ఉన్నారు. ఎల్‌బీనగర్‌లోని మసూం అలీ పాఠశాలలో అలీం 9వ తరగతి చదువుతున్నాడు. అలీం శాంతినగర్‌కు చెందిన ముగ్గురు, చార్‌బౌళికి చెందిన మరో మిత్రునితో మొత్తం ఐదుగురు ముసలమ్మకుంట వద్దకు వెళ్లారు. గుంతల్లో గాలం వేస్తున్న అలీంను ఈత కొట్టేందుకు లోపలికి రమ్మని స్నేహితులు పిలవగా తనకు ఈత రాదని చెప్పినప్పటికీ చివరకు కుంటలోకి దిగాడు. దిగుతున్న క్రమంలో అలీంతో పాటు మరో బాలుడు మునిగి పోయారు. పక్కనే ఉన్న ఒకరు వచ్చి మునిగిపోతున్న వారిని కాపాడే ప్రయత్నం చేయగా ఒకరిని గట్టుపైకి రాగా అప్పటికే అలీం మాత్రం మునిగిపోయినట్లు తెలిసింది. దీంతో అక్కడ నుంచి అలీం స్నేహితులు భయంతో ఇళ్లకు వెళ్లగా ఒకరు మునిగిపోయారన్న విషయం వాట్సప్‌లో వైరల్‌ అయింది. ఈ మేరకు ఏనుమాముల పోలీసులు ముసలమ్మకుంట వద్దకు వెళ్లి గాలింపులు చేపట్టినప్పటికీ రాత్రి కావడంతో వాయిదా వేశారు. శనివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో కుంటలో అలీం మృతదేహం తేలడంతో రెస్క్యూ టీం ఒడ్డుకు తీసుకొచ్చారు. శవపంచనామా నిర్వహించి ఎంజీఎం ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని తల్లిదండ్రులు అప్పగించారు. అలీం తల్లిదండ్రులు నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో శాంతినగర్‌లో విషాదం అలుముకుంది.

స్కూటర్‌ నంబర్‌తో గుర్తింపు

ముసలమ్మకుంటలో విద్యార్థి గల్లంతైన ప్రచారం జరిగినప్పటికి ఎవరూ అన్న విషయం తేలలేదు. సంఘటనా స్థలం వద్ద విద్యార్థులు తెచ్చిన స్కూటర్‌ను వదిలిపెట్టి వెళ్లడంతో దాని నంబర్‌ను ట్రాఫిక్‌ పోలీస్‌ యాప్‌లో చెక్‌ చేశారు. ఈ స్కూటర్‌పై గత అక్టోబర్‌లో ట్రాఫిక్‌ చలాన్లు ఉండడంతో దానిపై ప్రయాణిస్తున్న వారిని గుర్తించి నిర్ధారణకు వచ్చి సమాచారం అందించడంతో శాంతినగర్‌కు చెందిన అలీంగా గుర్తించారు. వేసవి సెలవులు వస్తున్న దృష్ట్యా చెరువులు, కాల్వల వద్ద హెచ్చరిక బోర్డులతో పాటు గస్తీ నిర్వహించాలని నగర వాసులు పోలీసు, రెవెన్యూ అధికారులను కోరుతున్నారు.

అదుపుతప్పి టాటాఏస్‌ బోల్తా







ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు



ప్రమాద స్థలంలో గుమిగూడిన జనం

- 14 మందికి తీవ్ర గాయాలు
- తప్పిన పెనుప్రమాదం
- 12 మంది హైదరాబాద్‌ యూసుఫ్‌గూడ వాసులు

ఖానాపురం/నర్సంపేట: అదుపుతప్పి టాటాఏస్‌ ట్రాలీ వాహనం బోల్తా పడింది. ఈ ఘటనలో 14మందికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం వరంగల్‌ జిల్లా ఖానాపురం మండల కేంద్రం శివారులో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌ యూసుఫ్‌గూడకు చెందిన 12 మంది వరంగల్‌ జిల్లా దుగ్గొండి మండలం మైసంపల్లి గ్రామంలోని బంధువుల ఇంటికి గృహప్రవేశ కార్యక్రమానికి శనివారం ఉదయం వచ్చారు. కార్యక్రమం ముగిశాక మైసంపల్లికి చెందిన మరో ఇద్దరితో కలిసి మహబూబాబాద్‌ జిల్లా గూడూరు మండల పరిధిలోని పర్యాటక ప్రాంతమైన భీమునిపాదానికి వెళ్లారు. సాయంత్రం వరకు పర్యాటక ప్రాంతం వద్ద సంతోషంగా గడిపారు. తిరుగు ప్రయాణంలో టాటాఏస్‌లో మైసంపల్లికి వస్తుండగా ఖానాపురం శివారులో పాకాలవాగు బ్రిడ్జి సమీపంలో వాహనం ముందు టైర్‌ పంక్చర్‌ అయి అదుపు తప్పి కల్వర్టుకు ఢీకొని రోడ్డుపై బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మైసంపల్లికి చెందిన జెర్రిపోతుల చింటు, జెరిపోతుల వంశీ, యూసుఫ్‌గూడకు చెందిన మట్టాడ పవన్‌, పోలు, సీహెచ్‌.వెంకట్‌, ముదసాని చరణ్‌, పావని, వెంకటేశ్వర్‌రావు, మౌనిక, చిన్నారి టోని, సాయి, నిరాజ్‌, అవినాష్‌, రాజులకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వాహనంలో ఇరుక్కుపోయిన బాధితులను బయటకు తీశారు. స్థానికులు 108కు సమాచారం అందించగా సకాలంలో రాలేదు. దీంతో ఆటోలో స్థానికులతో పాటు పోలీసులు నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. వెంటనే వైద్యులు ప్రాథమిక వైద్య చికిత్సలు అందించారు. రోడ్డుపైనే పడడంతో పెను ప్రమాదం తప్పింది.

14మందిని కాపాడిన కల్వర్టు పిల్లర్‌

ఒక కల్వర్టు పిల్లర్‌ 14మందిని కాపాడింది. బ్రిడ్జి సమీపంలో ఉన్న కల్వర్టు పిల్లర్‌కు 14 మందితో ప్రయాణిస్తున్న టాటా ఏస్‌ ముందు ఢీకొనడంతో లోయలో పడకుండా హైవేపై పల్టీ కొట్టింది. దీంతో ఒక్క పిల్లర్‌ 14 మందిని కాపాడినట్లయింది.

గంట అయినా 108 వాహనం రాలేదు

ప్రమాదం 5.15 గంటలకు జరగగా గాయాలైన వారిని చికిత్స కోసం తరలించేందుకు సమీప ప్రజలు 108కు కాల్‌ చేసినా గంట వరకు సంఘటన స్థలానికి చేరుకోలేదు. పోలీసులు ఆటోల ద్వారా నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాణాలు బలికొనే కల్వర్టుకు ఉన్న పిల్లర్‌ పెద్ద ప్రమాదాన్ని అడ్డుకుంటే గాయాలైన వారిని 108 వాహన సిబ్బంది మాత్రం నిర్లక్ష్యం చేశారు.

వేలేరు సభా స్థలి పరిశీలన

- పలు సూచనలు చేసిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



సభాస్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ధర్మసాగర్‌(వేలేరు): వేలేరు మండలం సోడషపల్లి గ్రామశివారులో ఈ నెల 27న రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌ పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేయనున్న బహిరంగ సభాస్థలాన్ని శనివారం సాయంత్రం రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు.. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, జనగామ జెడ్పీ చైర్మన్‌ పాగాల సంపత్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా శంకుస్థాపన కార్యక్రమం, బహిరంగ సభ, పార్కింగ్‌ స్థలాలను పరిశీలించారు. అధికారులకు, బీఆర్‌ఎస్‌ నాయకులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్‌ సిక్తాపట్నాయక్‌ కూడా సభాస్థలిని పరిశీలించారు. సోడషపల్లి శివారులో ఏనుమాముల మార్కెట్‌ కమిటీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న మార్కెట్‌ సబ్‌ యార్డు పనులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఎడీఓ శ్రీనివాస్‌ కుమార్‌, సీఈఓ సుధాకర్‌రెడ్డి, డీఎల్‌పీఓ రవిబాబు, ఈఈ పీఆర్‌ శంకరయ్య, కాజీపేట ఏసీపీ శ్రీనివాస్‌, ఎంపీపీ కేసిరెడ్డి సమ్మిరెడ్డి, జెడ్పీటీసీ చాడ సరిత, ఎంపీడీఓ జవహర్‌రెడ్డి, పీఏసీఎస్‌ చైర్మన్‌ గున్‌రెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌ కొట్టె రాజేష్‌ పాల్గొన్నారు.

అధికార పార్టీ సర్పంచ్‌ వేధింపులు..

- ఆశ వర్కర్‌ ఆత్మహత్యాయత్నం
- వేధింపులకు గురి చేయలేదన్న సర్పంచ్‌



చికిత్స పొందుతున్న నీల

ఖానాపురం: అధికార పార్టీ సర్పంచ్‌ వేధింపులు తట్టుకోలేక ఓ ఆశ కార్యకర్త శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధిత మహిళ కున్‌సోతు నీల తెలిపిన వివరాల ప్రకారం.. నాజీతండాకు చెందిన నీల ఆశ కార్యకర్తగా 18 ఏళ్లుగా బోటిమీదితండా, నాజీ తండా పరిధిలో విధులు నిర్వహిస్తోంది. కొద్ది నెలల క్రితం ఆశ కార్యకర్త, హెల్త్‌ సూపర్‌వైజర్ల పనితీరు సరిగా లేదని, వారిని తొలగించాలని గ్రామపంచాయతీలో తీర్మానం చేశారు. ఇదే సమయంలో మండల సభలో సర్పంచ్‌ బాదావత్‌ బాలకిషన్‌ ఆశ కార్యకర్తపై ఆరోపణలు చేస్తూ అధికారులను నిలదీశారు. ఈ మేరకు ఇటీవల డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విచారణకు రావడంతో ఆ సమయంలో సర్పంచ్‌ చంపుతానంటూ ఆశ కార్యకర్తను బెదిరిస్తుండగా ఓ యువకుడు వీడియో తీశాడు. ఆ సెల్‌ఫోన్‌ స్థానిక ఎస్సై వద్దకు చేరింది. ఆయన పది రోజుల పాటు తనవద్దే ఉంచుకోగా ఆశ కార్యకర్త వెళ్లి ఆ సెల్‌ఫోన్‌ ఇవ్వమని అడగడంతో అదే సమయంలో సర్పంచ్‌ వచ్చి ఫోన్‌ తీసుకుని వీడియోను డిలీట్‌ చేయించి వెళ్లిపోయాడు. ఇలా వీరి మధ్య వివాదం మరింత పెరిగింది. ఈ క్రమంలో కంటివెలుగు శిబిరాల విధులకు నీలను రానీయకుండా అధికారులపై ఒత్తిడి తెచ్చి అడ్డుకోవడం, చంపుతానని బెదిరిస్తున్నాడు. నాలుగు రోజులుగా వేధింపులు ఎక్కువ కావడంతో తట్టుకోలేక శనివారం పురుగుల మందు తాగింది. గమనించిన బంధువులు చికిత్స నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. సర్పంచ్‌ బాలకిషన్‌తో పాటు బీఆర్‌ఎస్‌ యూత్‌ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌లు తనను ఇబ్బంది పెడుతున్నట్లు నీల ఆరోపించింది. విధులకు వెళ్తుండగా మధ్యలో అడ్డుకుని చంపుతానని బెదిరిస్తూ శారీరక వేధింపులకు గురిచేస్తున్నాడని తెలిపింది. ఆశ కార్యకర్తను చంపాలని, చంపిన తర్వాత చిన్న కేసుతో బయటకు వస్తానని తన ముందే ఫోన్‌లో మాట్లాడుతూ బెదిరించేవాడని వాపోయింది. దీనిపై సర్పంచ్‌ బాలకిషన్‌ మాట్లాడుతూ ఆశ కార్యకర్త నీల విధులు సరిగా నిర్వహించడం లేదని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీలు చేయించకుండా ప్రైవేట్‌కు పంపుతూ ప్రజల వద్ద డబ్బులు తీసుకుంటుందని తెలిపారు. ఆమెను ఎలాంటి వేధింపులకు గురిచేయలేదని పేర్కొన్నారు. ఆమె డబ్బులు వసూలు చేసిన వివరాలన్నీ తన వద్ద ఉన్నాయని చెప్పారు.

నా చావుకు ఎంపీటీసీ భర్తే కారణం..

- రియల్టర్‌ విజయ్‌కుమార్‌ కూడా
- న్యాయం చేస్తానని నమ్మించి మోసం చేశారు
- ఆయన వల్ల ఉద్యోగం కోల్పోయా.. ఆర్థికంగా చితికిపోయా..
- వైరల్‌ అవుతున్న వీడియో



పురుగుమందు డబ్బాతో సిద్దులు

రఘునాథపల్లి : నాకు న్యాయం చేస్తానని నమ్మించి మోసం చేసిన శివాజీనగర్‌ ఎంపీటీసీ భర్త బొల్లపల్లి వెంకటస్వామి నా చావుకు కారణమని కోమళ్ల గ్రామానికి చెందిన మంద సిద్దులు చేతిలో పురుగుల మందు డబ్బా పట్టుకొని సెల్ఫీ తీసుకున్న వీడియో శనివారం సోషల్‌ మీడియాలో వైరల్‌గా మారింది. అశ్వరావుపల్లి శివారులోని సర్వే నెంబర్‌ 324లో తమ కుటుంబానికి 22 గంటల భూమి ఉందని (టోల్‌ గేట్‌, మండల కార్యాలయం మధ్య) కబ్జాలో మాత్రం మంద కొంరయ్య, మంద చంద్రయ్య, తూంకుంట్ల రాంరెడ్డిలు ఉన్నారని వీడియోలో సిద్దులు పేర్కొన్నారు. మా భూమి మాకు ఇప్పిస్తానని తమ గ్రామానికి చెందిన ఎంపీటీసీ భర్త వెంకటస్వామి తనను సంప్రదించాడని, స్వతహాగా లాయర్‌ అయిన వెంకటస్వామి, ఆయన పేరిట ఎకరం భూమి పట్టా చేయించుకొని నాకు అన్యాయం చేశాడన్నారు. 14 నెలల పాటు కేసు పేరిట లింగంపల్లిలో ఉంటున్న తనను కోమళ్లకు పిలిపించాడన్నారు. దీంతో రవాణా, ఇతర ఖర్చులతో ఆర్థికంగా చితికిపోయినట్టే పేర్కొన్నారు. తరచూ సెలవులు పెట్టి రావడంతో ప్రైవేట్‌ ఉద్యోగం పోయిందని, ఇబ్బందులు భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని, నా చావుకు బొల్లపల్లి వెంకటస్వామి, రియల్టర్‌ విజయ్‌కుమార్‌ కారణమని చెప్పాడు. ఈ వీడియో మండలంలోని వివిధ సామాజిక మాధ్యమ గ్రూపుల్లో వైరల్‌గా మారింది. ఈ వీడియోపై వెంకటస్వామిని వివరణ కోరగా తాను పెద్దమనిషిగా వ్యవహరించానే కాని, అతనికి ఎలాంటి అన్యాయం చేయలేదని తెలిపారు. తనను బ్లాక్‌మెయిల్‌ చేస్తున్న సిద్దులుపై శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.